# బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (తెలంగాణ)

## సంగ్రహణాత్మక మూల్యాంకనం – II

## పదోతరగతి తెలుగు నమూనా ప్రశ్నపత్రం

## పేపర్ – I

| సమయం: 2 గం.45 ని. | పార్టు – A & B | గరిష్ఠ మార్కులు: 40 |
|---|---|---|

సూచనలు: i) మొదటి 15 నిమిషాలు ప్రశ్నపత్రం చదువుకోవడానికి, మిగతా 2.30 గంటల సమయం జవాబులు రాయడానికి కేటాయించారు.

ii) పార్టు - A ప్రశ్నలకు జవాబుపత్రంలో సమాధానాలు రాయాలి.

iii) పార్టు - B సమాధానాలు ప్రశ్నపత్రంలోనే రాసి, పార్టు - A జవాబు పత్రానికి జతచేసి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలి.

| సమయం: 2 గంటలు | పార్టు – A | మార్కులు: 30 |
|---|---|---|

**I.** స్వీయరచన (30 మార్కులు)

అ) కింది ప్రశ్నలకు అయిదేసి వాక్యాల్లో జవాబులు రాయండి. 4 × 3 = 12

1. తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము – అంటే మీకేమర్థమైంది?
2. దొడ్డ బాల్బోవా వృక్ష ప్రత్యేకత ఏమిటో రాయండి.
3. సామల సదాశివ గురించి రాయండి.
4. 'ఎంతటి ఎత్తుకెదిగినా ఉంటుంది పరీక్ష' అంటే ఏమిటి?

ఆ) కిందివాటిలో ప్రతిభాగం నుంచి తప్పనిసరిగా ఒక ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి. 3 × 6 = 18

5. 'భిక్ష' పాఠం ఆధారంగా వ్యాసుడి వ్యక్తిత్వాన్ని తెలపండి.

(లేదా)

'నగరగీతం' పాఠం ఆధారంగా నగరంలోని కష్టాలను వివరించండి.

6. 'కొత్తబాట' పాఠం ఆధారంగా ఆనాటి కాలంలో ఉన్న సామాజిక పరిస్థితులను వివరించండి.

(లేదా)

నెల్లూరి కేశవస్వామి చార్‌మినార్ కథల గురించి రాయండి.

7. రామాయణంలోని ఉత్తమ ఆదర్శాలను తెలపండి.

(లేదా)

రామాయణం ఆధారంగా స్నేహానికి ఉన్న గొప్పతనం గురించి వివరించండి.

www.eenadupratibha.net

సమయం: 30 నిమిషాలు | పార్టు – B | మార్కులు: 10

## II. పదజాలం $16 \times \frac{1}{2} = 8$

**అ) కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు సరైన అర్థాన్ని గుర్తించండి.**

8. అడవిలో వెళ్తుంటే చిరుతగండు కనిపించింది. ( )
అ) మగ చిరుత ఆ) ఆడ చిరుత ఇ) చనిపోయిన చిరుత ఈ) సింహం

9. నాగరాజు పణంలో పాల్గొన్నాడు. ( )
అ) ఆట ఆ) పందెం ఇ) వేలం ఈ) ధర్నా

10. సిరి ఏడుపాయల జాతరలో సూడిగములు కొన్నది. ( )
అ) బొమ్మలు ఆ) గాజులు ఇ) తీపిపదార్థాలు ఈ) బట్టలు

11. మా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టుపై బండజింకలు ఉన్నాయి. ( )
అ) కొంగలు ఆ) కాకులు ఇ) గబ్బిలాలు ఈ) కోతులు

**ఆ) కింది పర్యాయపదాలను అడిగిన విధంగా గుర్తించండి.**

12. త్యాగం పదానికి పర్యాయ పదాలు రాయండి. ( )
అ) దిక్కు, దిశ ఆ) ఈని, ఈగి ఇ) సరిహద్దు, ఎల్ల ఈ) పని, శ్రమ

13. బ్రహ్మచారి, వడుగు అనే పదాలకు సరిపోయే పర్యాయపదం ఏది? ( )
అ) వర్షం ఆ) వటువు ఇ) జాయ ఈ) చంద్రిక

14. ఆకాశంలో వెన్నెల అందం అలరిస్తుంది. గీత గీసిన పదానికి పర్యాయ పదాలను గుర్తించండి. ( )
అ) కరి, గజం ఆ) నాథుడు, ధవుడు
ఇ) జ్యోత్స్న, కౌముది ఈ) అందం, సంతోషం

15. వేదండం – పదానికి పర్యాయపదం రాయండి. ( )
అ) బాధ ఆ) కరి ఇ) దారి ఈ) స్తోత్రం

**ఇ) నానార్థాలను అడిగిన విధంగా గుర్తించండి.**

16. గుర్రం, దొంగ, సింహం – అనే పదాలకు సరిపోయే నానార్థం ( )
అ) కొమ్మ ఆ) హరి ఇ) వాన ఈ) భూమి

17. క్షేత్రం – పదానికి నానార్థాలను రాయండి. ( )
అ) కొలను, చెరువు ఆ) చోటు, పుణ్యస్థానం ఇ) చిత్రం, పత్రం ఈ) కన్నీరు, ఇనుము

**ఈ) కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు ప్రకృతికి వికృతిని, వికృతికి ప్రకృతిని రాయండి.**

18. జన్మించిన వారికి మృత్యువు తప్పదు ( )
అ) మిత్తి ఆ) మృతి ఇ) మృత్యు ఈ) మితవు

19. సినారె కైత అందరిని ఆకట్టుకుంటుంది. ( )
అ) కథ ఆ) కత ఇ) కవిత ఈ) కయిత

**20.** అనంతమైన శక్తి ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ( )

అ) సత్తి ఆ) శగితి ఇ) శకితి ఈ) శతి

**21.** వీరేశం కంబము పైకి ఎక్కాడు. ( )

అ) రంపము ఆ) స్తంభము ఇ) గృహము ఈ) కట్టె

**ఉ) కింద ఇచ్చిన పదాలకు వ్యుత్పత్త్యర్థాలను గుర్తించండి.**

**22.** త్రివిక్రముడు – వ్యుత్పత్త్యర్థాన్ని గుర్తించండి. ( )

అ) ముల్లోకాలను ఆక్రమించనివాడు ఆ) ముల్లోకాలను ఆక్రమించినవాడు

ఇ) ముల్లోకములు తెలియనివాడు ఈ) ముల్లోకములు తెలిసినవాడు

**23.** కమలము నందు పుట్టినవాడు – వ్యుత్పత్త్యర్థాన్ని గుర్తించండి. ( )

అ) అధ్యక్షుడు ఆ) నీరజ భవుడు ఇ) విశ్వంభరుడు ఈ) పారాశర్యుడు

**ఊ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.** **2 × 1 = 2**

1) అపారం 2) సంస్కరణ

www.eenadupratibha.net

# సమాధానాలు

## పార్టు – A

I. స్వీయరచన

అ)

**1. తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము అంటే మీకేమర్థమైంది?**

జ: తెలంగాణలో గొప్పరాజుగా పేరుగాంచిన నిజాం రాజు గర్వాన్ని అణిచివేసే ప్రయత్నంలో గడ్డిపోచ కూడా కత్తిలా తయారైందని అర్థమైంది. అది ఎలా అంటే ఏమీ చేతగాని వారు కూడా కత్తిలా మారి తమ యుద్ధ పటిమను చూపించారు. అంటే ఏమీ విలువ లేని గడ్డి కూడా కత్తిలామారి ఎదురునిలిచింది. తెలంగాణ కోసం అన్ని వర్గాలవారు, చిన్నవారు మొదలు ముసలివారి వరకు ఏకమయ్యారు తమకు తోచిన విధంగా తెలంగాణ కోసం విజృంభించారని అర్థమైంది.

**2. దొడ్డ బాల్సోవా వృక్ష ప్రత్యేకత ఏమిటో రాయండి.**

జ: గొలకొండ పట్టణంలో మజ్నూ బురుజుకు వాయువ్యదిశలో ఉన్న వృక్షం దొడ్డ బాల్సోవా. ఇది 80 అడుగుల చుట్టు కొలతతో విస్తరించి ఉంది. ఈ చెట్టు పాదము తొర్రలో ఒక గుండ్రని బల్ల, దాని చుట్టూ నాలుగు కుర్చీలు వేసుకొని నలుగురు కూర్చుండే సౌకర్యం ఉంటుంది. అల్పాహారం తీసుకునేందుకు వీలుగా, విశాలంగా ఉండేది. ఆ తొర్ర గదిలోకి గాలి, వెలుతురు కూడా చక్కగా వచ్చేది. ఈ చెట్టును సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా ఆఫ్రికా నుంచి తెప్పించారు. ఈ వృక్షం గొలకొండ పట్టణంలో ఆకర్షణీయంగా ఉండేది.

**3. సామల సదాశివ గురించి రాయండి.**

జ: సామల సదాశివ సంస్కృతం, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, పార్సీ, మరాఠీ భాషల్లో పండితుడు. అనేక భాషల్లో ఉన్న సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. ఆయన ఉర్దూ సాహిత్య చరిత్ర, అమ్జద్ రుబాయాలు, మలయ మారుతాలు, యాది, సంగీత శిఖరాలు రాశారు. అమ్జద్ రుబాయాలు అనువాదానికి 1964లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ అనువాద రచనా పురస్కారాన్ని అందించింది. 'స్వరలయలు' గ్రంథానికి 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కాకతీయ, తెలుగు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి. ఈయన రచనల్లో భాష సహజ సుందరంగా, సరళంగా ముచ్చట్ల రూపంలో హత్తుకునేలా ఉంటుంది.

**4. 'ఎంతటి ఎత్తుకెదిగినా ఉంటుంది పరీక్ష' అంటే ఏమిటి?**

జ: మనిషి పుట్టినప్పటి నుంచి ఏదో ఒక రూపంలో సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. చదువుకునే సమయంలో రాసే పరీక్షలాగే ఎంత గొప్పగా ఎదిగినా వివిధ స్థాయిల్లో సమస్యల పరీక్షలు వస్తూనే ఉంటాయి. వాటిని మనం ఊహించలేం. ఆ సమస్యల పరీక్షలను ఎదుర్కోవాల్సిందే. జీవితాంతం వరకు పరీక్ష ఉంటుంది. కాబట్టి ఎదుర్కొనే శక్తిని కలిగి ఉండాలి. ఈ పరీక్ష ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి మనిషికి ఉంటుంది.

ఆ)

**5. భిక్షపాఠం ఆధారంగా వ్యాసుడి వ్యక్తిత్వాన్ని వివరించండి.**

జ:
- ★ కాశీలో విద్యా గురుడైన మహర్షి వ్యాసుడు.
- ★ కాశీనగరంలో శిష్యులతో కలిసి భిక్షకోసం ఇల్లిల్లూ తిరిగేవాడు.
- ★ భిక్షకోసం తిరిగే సమయంలో ఓపికతో ఉండేవాడు.
- ★ పుణ్య స్త్రీలు ఉన్న కాశీలో భిక్ష దొరకని సమయంలో ఏ పాపిష్టి వాడి ముఖం చూశానో అని అనుకునేవాడు.
- ★ వ్యాసుడు కోప స్వభావం కలవాడు.
- ★ భిక్ష దొరకని సమయంలో భిక్ష పాత్రను వీధిలో విసిరి కొట్టి కాశీ నగరాన్ని శపించబోయాడు.
- ★ శిష్యులతో కలిసి భుజించడం అనే వ్రతం విడిచిపెట్టనివాడు.
- ★ శిష్యులతో కలిసి గంగానదికి వెళ్లి స్నాన, ఆచమనాదులు చేసిన గురువు.

★ సామాన్య స్త్రీగా వచ్చిన పార్వతీదేవి మాటలను శ్రద్ధతో విన్న అపూర్వ గురువు.

★ భిక్షను పవిత్రంగా స్వీకరించే మహా మనిషి.

★ వేద విభజన చేసిన మహామహుడు.

★ మహా భారతాన్ని, అష్టాదశ పురాణాలను రాసిన బ్రహ్మజ్ఞాని.

**(లేదా)**

ప్ర. **'నగరగీతం' పాఠం ఆధారంగా నగరంలోని కష్టాలను వివరించండి.**

జ: ★ నగరంలోని మానవుల బతుకుపోరాటం రణగొణ ధ్వనుల్లా వినిపిస్తుంది.

★ ఉపాధికోసం వెళ్లిన పల్లె వాసులు ఉండేందుకు స్థలం లేక, మురికి ప్రదేశంలో ఊపిరి తీయలేని పరిస్థితుల్లో బతుకుతారు.

★ ఎవరిని ఎవరూ పట్టించుకోరు. ఏకాకిలా తన బాధలు తానే పడాలి.

★ వింత సమస్యలతో, విపరీతమైన మనస్తత్వాలతో ఉంటారు.

★ ఎంత కష్టపడి పని చేసినా విశ్రాంతి తీసుకోవడానికి సమయం దొరకదు.

★ డబ్బు సంపాదించినా కోరికలను తీర్చుకునే వీలుండదు.

★ నగరంలో మృత్యువు నాలుగు దిక్కుల నుంచి రోడ్లపై సిద్ధంగా ఉంటుంది.

★ ఆత్మీయ పలకరింపులు ఉండవు.

★ ఉపాధి కోసం ఆశగా ఎదురు చూస్తారు.

★ కాలుష్యంతో నిండిన నగర జీవనంలో మానవులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు.

★ ట్రాఫిక్ జామ్‌లతో తర్జన భర్జన పడుతూ, ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు.

★ నగర జీవనం కృత్రిమ నవ్వులతో, అస్తవ్యస్తంగా సాగుతుంది.

★ ఒక పుస్తకంలో ఎన్ని పేజీలు ఉంటాయో నగర జీవికి అన్ని పేజీల కష్టాల జీవితం ఉంటుంది.

6. **కొత్తబాట పాఠం ఆధారంగా ఆనాటి కాలంలో ఉన్న సామాజిక పరిస్థితులను వివరించండి.**

జ: కొత్తబాట పాఠంలో అక్కాతమ్ముడు తమ ఊరికి చేరిన సందర్భంలో గతంలో వాళ్ల ఊరిలో ఉన్న సామాజిక పరిస్థితులను తలుచుకుంటూ ముందుకు వెళ్లారు.

★ గోపాల్రాయుడి భవంతి రాగానే ఎర్రపర్దాను బండికి వేలాడదీయడం.

★ రచ్చబండ, రాగిచెట్టు, తోటి మనుషులకు సమానంగా నీడను ఇవ్వకపోవడం.

★ మిత్తీలకు డబ్బులిచ్చి దోపిడి చేసేవారు.

★ కుటిలవాజి తనంతో కడుపులో విషం పెట్టుకొని బయటికి తీపి మాటలు మాట్లాడటం.

★ ప్రతి చిన్న విషయానికి పంచాయితీ పడేవారు. దండుగలు కట్టేవారు.

★ అర్ధరాత్రుల్లో దొంగతనాలు, సేండ్ల దోపిడీలు ఉండేవి.

★ శిక్షలుగా పరిక్కంపలు, ముంతపొగలు, ఈపుముద్దెర్లు, ఉండేవి.

★ రాత్రిబడులు లేవు.

★ పెండ్లింట పల్లకి మోసే సంప్రదాయం ఉండేది.

★ పిల్లలు చీమిడి ముక్కులతో, సింపులతో, సీరపేండ్లతో ఉండేవారు.

★ ఒకరిని ఎక్కించి, ఒకరిని దించి ఇద్దరినీ ఎదగనీయకుండా చేసేవారు.

(లేదా)

ప్ర. **నెల్లూరి కేశవస్వామి చార్‌మినార్ కథల గురించి రాయండి.**

జ: నెల్లూరి కేశవస్వామి హైదరాబాద్‌లోని జీవభాషను కథల్లో చిత్రించిన రచయిత. 'పసిడి బొమ్మ' ఈయన తొలికథల సంపుటి. కేశవస్వామి రెండో కథా సంకలనం 'చార్‌మినార్ కథలు'. ఇవి ఊహాజనిత కథలు కావు. సామాజిక పరిణామాలకు సాహిత్య రూపం ఇచ్చిన సామాజిక చరిత్ర రచనగా చెప్పవచ్చు.

హైదరాబాద్ రాజ్యం చరిత్ర, సంస్కృతి, మానవ సంబంధాలు, ముస్లింల జీవితాలను చార్‌మినార్ కథలు అపూర్వంగా చిత్రించాయి. ఇందులో విముక్తి, రూహిఆపా, షరీఫా, ప్రతీకారం, అదృష్టం, యుగాంతం, వంశాంకురం, కేవలం మనుషులం, ఆఖరి కానుక, భరోసా అనే శీర్షికలతో రాసిన 11 కథలు ఉన్నాయి.

చార్‌మినార్ కథల్లోని నవాబులు, దేవిడీలు, దాల్చా, నమాజులు లాంటివి మధ్య ఆసియా ముస్లిం దేశాల సంస్కృతిని గుర్తుకుతెస్తాయి. ఈ కథలు అంతర్జాతీయ సంస్కృతి, హైదరాబాద్ రాజ్యంలో జీవనవిధానం నిర్దిష్టంగా ఎలా ఉండేదో తెలుపుతాయి.

యుగాంతం అనే కథ హైదరాబాద్ రాజ్యంలోని ప్రత్యేక పరిణామాలను, సామాజిక చరిత్రను చారిత్రక డాక్యుమెంటుగా ఉంచుతుంది. మతాల సరిహద్దులను చెరిపివేసిన స్నేహంగా 'కేవలం మనుషులం' కథ నిలుస్తుంది. నమ్మిన పేదలను ఎలా ముంచుతారో 'భరోసా' కథ తెలుపుతుంది. ముస్లిం పెళ్లి సంబంధాలు, కొడుకు పుట్టాలనే ఆశతో ఆడపిల్లలు ఎలా వారి జీవితాలను బలిచేసుకునేవారో తెలిపే 'వంశాంకురం' కథ, మానవసంబంధాలను తెలిపే 'రూహిఆపా' కథ లాంటివి గొప్పగా నిలిచాయి.

7. **రామాయణంలోని ఉత్తమ ఆదర్శాలను తెలపండి.**

జ: **రామాయణంలోని ఉత్తమ ఆదర్శాలు**

★ తల్లిదండ్రుల పట్ల ప్రేమ, మమకారాన్ని కలిగి ఉండటం. వారి మాటలను పాటించడం, గురువుల పట్ల గౌరవాన్ని కలిగి ఉండటం.

★ ఆపదలో ఆదుకోవడం.

★ ఇచ్చినమాట నిలబెట్టుకోవడం.

★ మృదువుగా మాట్లాడటం.

★ శరణం అన్న వారిని ఆదుకోవడం.

★ ధైర్యాన్ని కలిగి ఉండటం.

★ స్నేహం విలువను తెలుసుకోవడం.

★ స్నేహం కోసం సంపదలను, సుఖాలను విడిచిపెట్టడం.

★ అన్నదమ్ములు అన్యోన్య అనుబంధాలను కలిగి ఉండటం.

★ ధర్మానుసారంగా జీవించడం.

★ పవిత్రమైన జీవనవిధానాన్ని కలిగి ఉండటం.

★ చెడు పనులకు దూరంగా ఉండటం. అది చేసేవారికి సహాయ పడకపోవడం.

★ స్త్రీలను గౌరవించడం.

★ నమ్మకంతో కార్యసాధన చేయడం.

(లేదా)

ప్ర. **రామాయణం ఆధారంగా 'స్నేహానికి ఉన్న గొప్పతనం' గురించి వివరించండి.**

జ: రామాయణంలో స్నేహానికి ఉన్నత స్థానం ఉంది. శ్రీరాముడు పంచవటికి చేరిన తరువాత సీత రక్షణ బాధ్యతను జటాయువుకు అప్పగించడం చూస్తే తండ్రి దశరథమహారాజుకు అత్యంత ఆప్తమిత్రుడిగా జటాయువు ఉండటం వల్లే అది సాధ్యమైంది. సీతను

రావణుడు అపహరించిన తరువాత 'కబంధుడు' సుగ్రీవుడి మైత్రి గురించి రాముడికి చెప్పాడు. అగ్ని సాక్షిగా శ్రీరాముడు, సుగ్రీవుడు స్నేహితులయ్యారు. 'ఆపదలో ఆదుకునేవాడు మిత్రుడు, వాలిని తప్పక చంపుతాను' అని స్నేహం కోసం శ్రీరాముడు సుగ్రీవుడికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. సీత లేక బాధపడుతున్న శ్రీరాముడి కోసం తన సుఖాలను, సంపదను, చివరకు తన ప్రాణాలను కూడా వదలడానికి సుగ్రీవుడు సిద్ధమయ్యాడు స్నేహధర్మాన్ని ఇద్దరూ పాటించడం చాలా గొప్పగా ఉంది. స్నేహానికి మారుపేరుగా వారిద్దరూ నిలిచారు.

రావణుడు రాముడితో యుద్ధం చేస్తున్న సందర్భంలో ఒకసారి అంతఃపురానికి వెళ్లిన రావణుడు కుంభకర్ణుడిని సమీపించి నిద్రలేపాడు. కానీ అతడు లేవలేదు. ఇంతలో రావణుడు 'ఆపదల పాలైన వారిని ఆదుకునేవాడు నిజమైన మిత్రుడు. తప్పుదారి పట్టి కష్టాల్లో పడ్డవారికి చేయూతనిచ్చి ఆదుకునేవాడు ఆప్తుడు' అని స్నేహవచనాలు పలికాడు. దీంతో కుంభకర్ణుడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. కాలం గడిచినా స్నేహానికి ఉన్న గొప్పతనం రామాయణంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

## పార్టు – B

8-అ; 9-ఆ; 10-ఆ; 11-ఇ; 12-ఆ; 13-ఆ; 14-ఇ; 15-ఆ; 16-ఆ; 17-ఆ; 18-అ; 19-ఇ; 20-అ; 21-ఆ; 22-ఆ; 23-ఆ.

**సొంతవాక్యాలు**

**1)** **అపారం:** తెలంగాణలో వనరులు అపారం.

**2)** సంస్కరణ: ప్రతి ఒక్కరు సమాజ సంస్కరణ కోసం పూనుకోవాలి.

**రచయిత: అంజాగౌడ్**

www.eenadupratibha.net